క్లుప్తంగా

ఐటీఐలో మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

పీలేరు : స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మిగిలివున్న సీట్లకు దరఖాస్తులు కోరుతున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బాలమురళీ ప్రసాద్ అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వచ్చే నెల 15 లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 21-07-2025 తేదీ ఉదయం పది గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్స్, రెండు ఫోటోలు, వెరిఫికేషన్ ఫారంతో హాజరు కావాలని కోరారు. పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులు కూడా వెల్డర్ కోర్సుకు అర్హులని తెలిపారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

పీలేరురూరల్ : జూలై 5వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా 11వ అదనపు జడ్జి ఎ. మహేష్ అన్నారు. శనివారం స్థానిక ఏడీజే కోర్టులో న్యాయవాదులు, పోలీసులు, వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ లోక్‌అదాలత్‌లో కుటుంబ తగాదాలు, మోటారు వాహన కేసులు, బీఎస్ఎన్ఎల్ కేసులు, ఇన్సూరెన్స్ మొదలగు పెండింగ్ కేసులకు సంబంధించి ఇరు వర్గాలను ఒప్పించి కేసులు పరిష్కరించాలన్నారు. రాజీమార్గమే రాజమార్గమన్నారు. ఎక్కువ కేసులు పరిష్కారినికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్, సీఐ యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

పెద్దతిప్పసముద్రం: మండలంలోని బూచిపల్లిలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మండలంలోని తుమ్మరకుంటకు చెందిన యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో బెంగళూరులోని వైదేహీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వారి సహకారంతో నిర్వహించిన వైద్య శిబిరంలో 200 మంది వివిధ వ్యాధిగ్రస్థులు పరీక్షలు చేయించుకోగా వీరిలో 40 మంది వివిధ జబ్బులకు సంభంధించి ఉచిత ఆపరేషన్‌కు ఎంపికైనట్లు సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, డాక్టర్ లోకేష్ భరణి పేర్కొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

మదనపల్లె రూరల్ : విద్యను వ్యాపారంగా మార్చుకుని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని బహుజన యువసేన అధ్యక్షులు పునీత్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక డీవైఈఓ కార్యాలయం ఎదుట బీవైఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించిన అనంతరం డీవైఈఓ లోకేశ్వరరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు హరీష్, హరికృష్ణ, జిలానిబాషా, శశికుమార్, వినయ్, శ్రీధర్, సద్దలహరి, శ్రీనివాసులు, రమేష్, నిజాం, కుమార్, సాయి, బ్రహ్మ, సంతోష్, శశి, తేజ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బల్లలు ధ్వంసం

కలికిరి: మండలంలోని మేడికుర్తి క్రాస్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం దాతలు ఏర్పాటు చేసిన సిమెంటు బల్లలను శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని ఆకతాయిలు ధ్వంసం చేశారు. శనివారం ఉదయం ప్రయాణికులు గుర్తించి ఆకతాయిల ఆగడాలపై అసహనం వ్యక్తం చేశారు. దాతలు ప్రయాణికుల కోసం బల్లలు ఏర్పాటు చేస్తే ఆకతాయిలు ఇలా చేయడం దారుణమన్నారు. పోలీసులు విచారించి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరారు.

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం

మదనపల్లె రూరల్ : పెరుగుతున్న పోటీ ప్రపంచంలో ఒత్తిడి నుంచి తట్టుకోవడానికి యోగా మహత్తర సాధనమని, ప్రతి ఒక్కరి జీవితంలో యోగా దినచర్యలో భాగం కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని, నియోజకవర్గ వ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వకార్యాలయాల్లో విద్యార్థులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు యోగాసనాలు వేశారు. స్థానిక విజయభారతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో కరస్పాండెంట్ డాక్టర్.ఎన్.సేతు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, డీఎస్పీ మహేంద్ర, టౌన్‌బ్యాంక్ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, బీజేపీ నాయకులు చల్లపల్లె నరసింహారెడ్డి, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతమ్‌కుమార్, జనసేన నాయకులు రామదాస్‌చౌదరి, బహుజనసేన శ్రీచందు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.

పీలేరు : యోగా సాధన చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎంపీడీవో శివశంకర్ అన్నారు. శనివారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురష్కరించుకుని స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో యోగాసనాలు, అవగాహన సదస్సు నిర్వహించారు.

తంబళ్లపల్లె: ప్రతి ఒక్కరూ యోగాను ఆచరిస్తే మానసిక ప్రశాంతత కలుగుతుందని ఎంపీపడీఓ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం అంతర్జాయ యోగా దినోత్సవం సందర్భంగా మండలంలో శనివారం యోగాంధ్ర కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఉద్యోగులు యోగసనాలు చేశారు.

పెద్దమండ్యం: మనిషికి ఆరోగ్యాన్ని బోధించే సజీవ శాస్త్రం యోగా అని తహసీల్దార్ తేజస్వి, ఎంపీడీవో శ్రీధర్‌రావు లు అన్నారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు.



మదనపల్లె జెడ్పీహైస్కూల్‌లో ఆసనాలు వేస్తున్న అధికారులు

రామసముద్రం: యోగ సాధన ప్రతి ఒక్కరు అలవర్చుకుంటే ఎంతో ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీవో బానుప్రసాద్ , ఈవోపీఆర్‌డి గఫూర్ తెలిపారు. శనివారం రామసముద్రం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో, సచివాలయాలల్లో , అంగన్‌వాడీ యోగాసనాలు చేశారు.

బి.కొత్తకోట: ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని స్థానిక నగర పంచాయతీ కమిషనర్ జీవీ.పల్లవి అన్నారు. శనివారం కార్యాలయ ఆవరణలో యోగా డే నిర్వహించారు.

కలికిరి: ప్రపంచ యోగాదినోత్సవం సందర్భంగా శనివారం మండలంలోని ఘనంగా యోగా దినోత్సవం నిర్వహించారు. సీఆర్‌సీఎఫ్(సీఐఏటీ-3) కేంద్రంలో డీఐజీ అనుపమ్ శర్మ ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం నిర్వహించారు.

కలకడ : యోగాతో ఆరోగ్యం సాధ్యమని ఎంపీడీఓ అబ్దుల్‌రహీం అన్నారు. జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని శనివారం అన్ని ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులు అన్నిచోట్ల యోగా చేశారు.

కురబలకోట: యోగాడేని శనివారం మండలంలోని విద్యాలయాలు, మిట్స్, విశ్వం ఇంజినీరింగ్ కళాశాలలు, కార్యాలయాల వద్ద ఘనంగా నిర్వహించారు. యోగాసనాలు వేశారు.



పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో..



తంబళ్లపల్లె: యోగసనాలు చేస్తున్న అధికారులు

భిక్షాటనతో మున్సిపల్ కార్మికుల నిరసన

మదనపల్లె: పట్టణంలో 18 రోజులుగా తమ డిమాండ్ల పరిష్కారం కోసం నిరాహార దీక్షలు చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం కార్మికులు శనివారం భిక్షాటన ద్వారా నిరసన వ్యక్తం చేశారు. చేతిలో ప్లేట్లు పెట్టుకుని కనికరించు చంద్రబాబూ అంటూ భిక్షాటన చేశారు. చొక్కాలు తీసేసి మున్సిపల్ కార్యాలయం రోడ్డుపై ఈ నిరసన వ్యక్తం చేశారు. తమ న్యాయపరమైన డిమాండ్ల కోసం ఇంకెంత కాలం ఆందోళనలు చేయాలంటూ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం ఇచ్చిన సమ్మె గడువు ముగిసిందని, ఆదివారం నుంచి మదనపల్లె మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ చేయబోమని, పూర్తిస్థాయిలో సమ్మెలోకి దిగుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఇంజనీరింగ్ విభాగం కార్మికుల సమాన పనికి సమాన వేతనం, ప్రభుత్వ పథకాల వర్తింపు, టెక్నికల్, నాన్ టెక్నికల్ సిబ్బందికి నిర్ణీత వేతనాల చెల్లింపు తదితర సమస్యలను పరిష్కరించాలని కార్మికులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎస్‌కే.రెడ్డెప్ప, నాగరాజు, కన్నయ్య, గోపాలకృష్ణ, సజాద్, బాబు, ఎస్‌కే.రెడ్డెప్ప, ఎంఎస్.కన్నయ్య, కుమార్, మహేష్ కార్మికులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు బారికేడ్ల వితరణ

మదనపల్లె రూరల్ : పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు శనివారం భారతి సిమెంట్ కంపెనీకి చెందిన 40 బారికేడ్లను వితరణగా అందించారు. ఈ సందర్భంగా భారతి సిమెంటు కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ ఎం.సుబ్బరాయుడు, మదనపల్లె లోకల్ డీలర్స్, ఏఎస్ఐ రమణను కలిసి బారికేడ్లను అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బరాయుడు మాట్లాడుతూ...సామాజిక సేవలో భాగంగా భారతి సిమెంటు తరఫున ప్రతి ఏడాది ఏదో ఒక రూపంలో పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టూటౌన్ పోలీసులు, భారతి సిమెంట్ కంపెనీ స్థానిక డీలర్లు పాల్గొన్నారు.



పోలీసుస్టేషన్‌కు బారికేడ్లను అందిస్తున్న భారతి సిమెంట్ కంపెనీ ప్రతినిధులు

వాల్మీకిపురం తహసీల్దారుకు అదనపు బాధ్యతలు

కలికిరి: వాల్మీకిపురం తహసీల్దారు పామిలేటికి కలికిరి మండల ఇన్‌చార్జ్ తహసీల్దారుగా అదనపు బాధ్యతలు కేటాయిస్తూ జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేయడంతో శనివారం ఆయన కలికిరి మండల ఇన్‌చార్జ్ తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కాగా ఇటీవల సాదారణ బదిలీల్లో కలికిరి మండలానికి బదిలీ అయిన తహసీల్దారు హరికుమార్ తహసీల్దారుగా విధుల్లో చేరి అనంతరం సెలవుపై వెళ్లారు. ఇక్కడ పనిచేస్తున్న డీటీ నవీన్‌ను తంబళ్ళపల్లి మండల డీటీగా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో పెద్దమండ్యం తహసీల్దారు(ఏఫ్ఏసీ)గా పని చేసిన డీటీ సయ్యద్ అహ్మద్‌ను కలికిరి డిప్యూటీ తహసీల్దారుగా బదిలీ చేశారు. డీటీగా జాయిన్ అయిన ఆయన ఇన్‌చార్జ్ తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టిన రెండు రోజుల్లోనే కలికిరి ఇన్‌చార్జ్ తహసీల్దారుగా వాల్మీకిపురం తహసీల్దారును ఉన్నతాధికారులు నియమించారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలి

- స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి
- మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి



మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్, నాయకులు

మదనపల్లె రూరల్ : నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, లోక్‌సభపక్షనేత, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి సూచించారు. మదనపల్లె నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తిరుపతిలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. దుశ్శాలువతో సత్కరించి పూల బొకేలు అందజేశారు. అనంతరం నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులపై చర్చించారు.పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు చేయాల్సిన చర్యలపై వివరించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, జగనన్న ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అందిన సంక్షేమం, అభివృద్ధిని వివరించి, చంద్రబాబు చేసిన మోసాలపై తెలపాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజాసమస్యలను గుర్తించి, నాయకుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో పార్టీలో యాక్టివ్‌గా పనిచేసి, ప్రస్తుతం సైలెంట్‌గా ఉన్న వారిని గుర్తించి పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడాల్సిన అవసరం లేదని, ఏ కష్టం వచ్చినా పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా అధికారంలోకి వచ్చేది వైఎస్సార్ సీపీనే అని, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు శ్రమించాలన్నారు. మాజీ మంత్రి, ఎంపీని కలిసిన వారిలో నాయకులు వీఎస్.రెడ్డి, ఆవుల మల్లికార్జున, రమేష్, రఘునాథరెడ్డి, మహేశ్వరరెడ్డి, శంకర, వెంకటేష్, రాఘవ, బాలకృష్ణ, హరినాథ్, ప్రసాద్, దినకర్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణ కోసం డీఎస్పీని ఆశ్రయించిన ప్రేమజంట

మదనపల్లె రూరల్ : ప్రేమ వివాహం చేసుకున్న ఓ ప్రేమ జంట, కుటుంబ పెద్దల నుంచి రక్షణ కల్పించాలని డీఎస్పీ మహేంద్రను ఆశ్రయించారు. శనివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీని కలిసి రక్షణ కల్పించాల్సిందిగా కోరారు. పెద్దమండ్యం మండలం బండ్రేవు పంచాయతీ మాదిగపల్లెకు చెందిన అలుగంటి రమణయ్య కుమారుడు అయ్యప్ప(23) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఇతను నల్లచెరువు మండలానికి చెందిన కోటప్ప కుమార్తె భాగ్యలక్ష్మి(19) ప్రేమించుకున్నారు. వీరి ప్రేమను పెద్దలు అంగీకరించకపోవడంతో రెండు రోజుల క్రితం మదనపల్లె సమీపంలో వివాహం చేసుకున్నారు. తమ పెద్దల నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ డీఎస్పీని ఆశ్రయించారు.

బయట రాష్ట్రాల వ్యాపారులను పంపించి వేయండి

గుర్రంకొండ: బయట రాష్ట్రాలకు చెందిన వ్యాపారులను గుర్రంకొండ నుంచి పంపించి వేయాలంటూ స్థానిక వ్యాపారులు పంచాయతీ ఈవో శ్రీహరికి ఫిర్యాదు చేశారు. శనివారం స్థానిక గ్రామసచివాలయంకు చేరుకొన్న వ్యాపారులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బయట రాష్ట్రాలకు చెందిన ఎంతో మంది వ్యాపారులు గుర్రంకొండకు చేరుకొని అక్రమంగా వ్యాపారాలు చేసుకొంటున్నారని అన్నారు. ఖాళీ స్థలాల్లో కొంతమంది పంచాయతీ అనుమతి లేకుండా వ్యాపారాలను చేసుకొంటున్నారన్నారు. ఇలాంటి వారిపై విచారణ జరిపి పంచాయతీ వారు చర్యలు తీసుకోవాలన్నారు. వేలాది రుపాయలు అద్దెలు చెల్లించి తాము నిర్వహించుకొంటున్న వ్యాపారాలు బయట రాష్ట్రాల వ్యాపారులతో దెబ్బతింటున్నాయన్నారు. తక్కువ ధరలకే వస్తువులు, దుస్తులు విక్రయిస్తుండడంతో స్థానికంగా వ్యాపారం చేసుకొంటున్న తమకు అన్యాయం జరుగుతోందన్నారు. ఈవిషయమై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

పూర్వ విద్యార్థుల దాతృత్వం అభినందనీయం

కేవీపల్లె : మండలంలోని గ్యారంపల్లె ఏపీ గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థుల దాతృత్వం అభినందనీయమని ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. గ్యారంపల్లె గురుకుల పాఠశాలలో పూర్వ విద్యార్థుల దాతృత్వంతో రూ. 3 కోట్ల వ్యయంతో కంప్యూటర్ ల్యాబ్, బాలుర వసతి సముదాయం నిర్మాణానికి శనివారం ఎమ్మెల్యే చేతుల మీదుగా భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్యారంపల్లె గురుకుల పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు ఉందని తెలిపారు. ఈ పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల కృషి అభినందనీయమని చెప్పారు. అనంతరం యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నరేంద్రకుమార్, ఎంపీడీవో సుధాకర్, ఎంఈవో రెడ్డిబాషా పాల్గొన్నారు.

వంటశాల షెడ్డు నిర్మాణానికి భూమి పూజ

తంబళ్లపల్లె: మహాశివరాత్రి పర్వదినాన మల్లయ్యకొండకు వచ్చే లక్షలాది మంది భక్తుకు ప్రతి ఏడాది అన్నదానం చేస్తారు. మల్లయ్యకొండ కింద కనుగొండ మద్దిరెడ్డి అన్నదాన ట్రస్టు భవనంలో శనివారం ట్రస్టు అధ్యక్షుడు రాజశేఖరరెడ్డి అధ్యక్షతన త్రైమాసిక సమావేశం నిర్వహించారు. ట్రస్టు అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై సభ్యులు,భక్తుల సూచనలు, సలహాలు తీసుకున్నారు. ములకలచెరువు మండలం చౌడసముద్రంకు చెందిన దాత పుట్టా శేఖరగుప్తా సొంత నిధులతో వంటశాల షెడ్డు నిర్మాణానికి ముందుకు వచ్చారు. షెడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, రమణారెడ్డి, రామమూర్తి,జయనారాయణరెడ్డి, కరీమ్, ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

బలవంతపు ఫీజుల వసూళ్లపై చర్యలు తీసుకోవాలి

పీలేరు రూరల్ : బలవంతపు ఫీజులు వసూళ్లు చేస్తున్న ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమృతతేజ అన్నారు శనివారం మదనపల్లె డీవైఈవో లోకేశ్వర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.